

రామడుగులో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్

# ప్రజా క్షేత్రంలోకి వెళ్దాం

- రాబోయే ఎన్నికల్లో సత్తాచాటుదాం
- భవిష్యత్ మనదే.. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి
- మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్
- రామడుగులో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

రామడుగు (చొప్పదండి), డిసెంబర్15: 'ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సారథి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జనరంజక పాలన సాగింది. కానీ కొన్ని శక్తుల దుష్ప్రచారంతో ఓడిపోయాం. పార్టీ కార్యకర్తలు బాధపడొద్దు. కుంగిపోవద్దు. మళ్లీ ప్రజా క్షేత్రంలోకి వెళదాం. వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుదాం' అని మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బీ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని రామడుగు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించగా, వినోద్ కుమార్ హాజరయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ కేసీఆర్ సార్ అంటే రాష్ట్ర ప్రజానీకానికి తెలంగాణ జాతిపితగా అపారమైన గౌరవం ఉందన్నారు. కానీ చిన్న, చిన్న లోపాలతోనే పార్టీ ఓటమిని చవిచూడాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని సూచించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో దేశంలోనే రాష్ట్రానికి ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ఆదాయ వనరులను మెరుగుపరచుకోవడంలో దేశంలోనే రాష్ట్రం రెండో స్థానంలో ఉందని గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రజాక్షేత్రంలో ప్రజల పక్షాన నిలబడదామని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేద్దామని చెప్పారు. ఇక్కడ ఎంపీపీ కలిగేటి కవిత-లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడద్దు.. అండగా ఉంటా



పెద్దపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి, డిసెంబర్15: బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఓడిపోయామని అధైర్యపడవద్దని, అన్నివిధాలుగా ఉంటానని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి భరోసానిచ్చారు. పెద్దపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ఈ రోజూ ఓటమి రేపుటి గెలుపునకు నాంది అని చెప్పారు. రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ వెన్నుదన్నుగా నిలిచి, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు రఘువీర్‌సింగ్, గంట రాములు, బొద్దుల లక్ష్మణ్, బండారి స్రవంతీ శ్రీనివాస్, ఎన్ సంపత్, బాలాజీరావు, జడల సురేందర్, రామారావు, అనంతరెడ్డి, నర్సింహరెడ్డి, మహేందర్, ఉప్పు రాజ్‌కుమార్, మొబిన్, శ్రీనివాస్ ఉన్నారు.

# సిరిసిల్ల అడిషనల్ కలెక్టర్‌గా గౌతమి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పీ గౌతమి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన సత్యప్రసాద్ మూడు నెలల క్రితం ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి జడ్పీ సీఈవో గౌతంరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. తాజాగా 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గౌతమిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

# అధికారం ఉన్నా లేకున్నా ప్రజల కోసమే నా తపన

- గెలిచినప్పుడు పొంగిపోలేదు.. ఓడినప్పుడు కుంగిపోను
- ప్రజా తీర్పును శిరసావహిస్తా
- కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటా
- మెతక మనిషిని కాదు.. అవసరమైతే కఠినంగా ఉంటా
- బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, డిసెంబర్15: 'గెలిచినప్పుడు పొంగిపోలేదు. ఓడినపుపడు కుంగిపోను. ప్రజా తీర్పునకు శిరసావహిస్త. అధికారం ఉన్నా.. లేకున్నా ధర్మపురి ప్రజల కోసమే నా తపన' అంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భావోద్వేగానికి గురయ్యారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై ఈగకూడా వాలనీయనని, కంటికిరెప్పలా కాపాడుకుంటానని భరోసానిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ధర్మపురిలోని శ్రీలక్ష్మి నృసింహ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు ఆయన హాజరయ్యారు. ఈశ్వర్ రాగానే కార్యకర్తలు ఉద్వేగానికి గురయ్యారు. ఉబికి వస్తున్న కన్నీళ్లను దిగమింగుకుంటూ అభిమాన నేతకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ, నియోజకవర్గ కార్యకర్తల గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. ప్రతిఒక్కరూ తానే అభ్యర్థి అనుకుని పని చేశారని గుర్తుచేశారు. దురదృష్టశావత్తు తాను ఓడిపోయానని, రాష్ట్రంలో మనం అధికారం కోల్పోయామన్నారు. బీఆర్ఎస్‌కు ఒడిదొడుకులు కొత్త కాదని, రానున్న రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల రూపంలో పరీక్షలు రాబోతున్నాయన్నారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు పక్కా కార్యాచరణతో ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎన్నో విజయాలు సాధించిందని, అయినప్పటికీ కాంగ్రెస్ మనకన్నా బాగా పనిచేస్తారని ప్రజలు నమ్మి అవకాశమిచ్చారన్నారు. దుష్ప్రచారం కూడా కొంతపై చేయి సాధించిందన్నారు. రాష్ట్రం తెచ్చిన పార్టీగా బీఆర్ఎస్ ఎపుడూ తెలంగాణ ప్రజల పక్షమేనని పేర్కొన్నారు, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీ కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగడం హేయనీయమన్నారు. ఇలాంటి ఘటనలకు భయపడాల్సిన అవసరం లేదని, మిమ్మల్ని కాపాడుకునే బాధ్యత తనదేనని కొప్పుల భరోసా ఇచ్చారు.

**నిప్పుల్లో నడిచి ఈ స్థాయికి వచ్చా..**

ఈశ్వర్ అంటే సౌమ్యుడు, మెత్తటి మనిషి అనే భావనతో హద్దులు మీరితే ఊరుకునేది లేదని, మరో కోణం నుంచి చూస్తే తట్టుకోలేరని హెచ్చరించారు. కార్యకర్తలపై దాడులకు దిగినా, ఇబ్బందులకు గురుచేసినా ఎట్టిపరిస్థితుల్లో ఊరుకోబోనని స్పష్టం చేశారు. ధర్మపురి నుంచి నాలుగు సార్లు గెలిచిన ఎవరినీ నొప్పించలేదని, ఆ పరిస్థితి తీసుకురావద్దని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. ఓడినా, గెలిచినా ధర్మపురి నియోజకవర్గ ప్రజల కోసమే పనిచేస్తానని, తాను ఈ స్థాయికి అంత సులువుగా రాలేదని నిప్పుల్లో నడిచి వచ్చానని కొప్పుల గుర్తు చేశారు. ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వానికి కొంత టైం ఇద్దామని, హామీల అమలులో విఫలమైతే ప్రజా గొంతుక అవుదామన్నారు. ధర్మపురిలో మన నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఏమైనా లోపాలు ఉంటే ఆత్మపరిశీలన చేసుకొని సమీక్షించుకుందామన్నారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, పోరాటాలు కొత్త కాదన్నారు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, కేసీఆర్ దమ్మున్న నాయకుడు గనుకే తెలంగాణ సాధించారని గుర్తుచేశారు. రాజకీయాల్లో జయాపజయాలు సహజమని, బీఆర్ఎస్ త్యాగాల పార్టీ అని, పదవులను గడ్డి పోచల్లా వదలి పెట్టామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలక పక్షంలో ఉన్నా విపక్షంలో ఉన్నా ఎపుడూ ప్రజల పక్షమేనని, కష్టపడి పని చేసి కలిసి కట్టుగా పనిచేసి ముందుకుసాగుదామని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పని చేసిన అన్ని స్థాయిల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకందరికీ ధన్యవాదాలు తెలిపారు.

**కార్యకర్తల కంటతడి**

సమావేశానికి వస్తున్న ఈశ్వర్‌ను చూడగానే కార్యకర్తలకు ఉద్వేగానికి లోనయ్యారు. మహిళలు బోరున విలపించారు. ఈశ్వర్‌పై పడి కన్నీరుపెట్టుకున్నారు. ఈశ్వర్ కూడా కొంత ఉద్వేగానికి లోనయ్యారు. వీరిని ఈశ్వర్ సముదాయించారు. బీఆర్ఎస్ ఉద్యమపార్టీ అనీ, కార్యకర్తలు వీరసైనికులని, ఒక యుద్ధంలో ఒడగానే, మరో యుద్ధానికి సన్నద్ధం కావడమే సైనికుల లక్షణమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చకుంటే పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఎంపీపీలు ఎడ్ల చిట్టిబాబు, బాధినేని రాజమణి, లక్ష్మి, నక్క శంకరయ్య, జడ్పీటీసీలు బాధినేని రాజేందర్, బత్తిని అరుణ, రాజేందర్‌రావ్, జలేందర్, ఏఎంసీ చైర్మన్లు అయ్యోరి రాజేశ్‌కుమార్, హనుమాండ్లు, పత్తిపాక వెంకటేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న తదితరులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

# రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

- జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 15: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారంతో మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్‌లో స్వశక్తి సంఘాలకు శుక్రవారం రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మహిళా సంఘాలకు రూ .15 కోట్ల రుణాలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం, బ్యాంకులు మహిళలకు, మహిళా సంఘాలకు రుణాల రూపేనా ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని చెప్పారు. రుణాలను సద్వినియోగం స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా తోటి మహిళలకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. యూనియన్ బ్యాంక్ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ శివకోటయ్య మాట్లాడుతూ, వర్తక, వ్యాపార, వాణిజ్య సంస్థలను ఏర్పాటు చేసుకునే మహిళలకు త్వరితగతిన రుణాలు మంజూరు చేస్తామన్నారు. యూనియన్ బ్యాంక్ ద్వారా మహిళలకు అందించే వివిధ పథకాలు, రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, సెర్ప్ డీపీఎం మాణిక్‌రెడ్డి, మెప్మా ఏవో శ్రీనివాస్, యూబీఐ ఛీఫ్ మేనేజర్ సరల్‌గుప్తా, వివిధ శాఖల మేనేజర్లు, సెర్ప్, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.




జగిత్యాల: మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, యూబీఐ బ్యాంక్ అధికారులు